క్లుప్తంగా

రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాస్

వరంగల్ : వరంగల్ మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్‌గా బుద్దె శ్రీనివాస్‌ను నియమిస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం హనుమకొండలో బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా రైతు బంధు సమన్వయకర్త లలితాయాదవ్, 3వ డివిజన్ కార్పొరేటర్లు షీబారాణీ, తూర్పాటి సులోచన, అనిల్‌కుమార్, సారయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు సంఘం 51వ డివిజన్ కమిటీ

హన్మకొండ: మున్నూరు కాపు సంఘం 51వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం తెలిపారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలో డివిజన్ మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షురాలిగా గంగుల వినోద, ఉపాధ్యక్షులుగా జిలకల దుర్గారావు పటేల్, రాకం ప్రవీణ్ పటేల్, కారంగుల వాణి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల వెంకట్ పటేల్, సహాయ కార్యదర్శిలుగా అడప రాజు పటేల్, కొప్పుల సతీష్ పటేల్, కోశాధికారిగా పత్రి శ్రీకాంత్ పటేల్ ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని వివరించారు. ఈ మేరకు కమిటీ వివరాలను అధ్యక్షురాలు గంగుల వినోదకు అందించారు.

సేవలు అభినందనీయం

కాజీపేట రూరల్ : కాజీపేట లోడి సాంఘీక సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం లోడి డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డికి వీడ్కోలు, హుస్నాబాద్ సేయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఎస్.ఇన్నారెడ్డికి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. జనగాం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న విజయపాల్‌రెడ్డి, జోసెఫ్ స్కూల్ ప్రిన్స్‌పాల్‌గా పని చేస్తున్న ఫాదర్ ఇన్నారెడ్డి లోడి సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు ఫాదర్లకు లోడి సంస్థ సిబ్బంది పూలబొకేలు అందజేసి సన్మానం చేశారు. లోడి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రక్తదానశిబిరం

హసన్‌పర్తి : మండలంలోని భీమారంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సీహెసీ, పరకాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, చర్చి ప్రెసిడెంట్ సంగాల ప్రేమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, సెక్రటరీ పరమేష్ పాల్గొన్నారు.

తడిసి ముద్దయిన ధాన్యం

హసన్‌పర్తి : మండలంలోని వంగపహాడ్, నాగారం, మడిపల్లి, పెంబర్తి, గంటూరుపల్లిల్లో మంగళవారం కురిసిన భారీవర్షానికి పెద్ద ఎత్తున వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. కొన్ని కేంద్రాల్లో రైతులు వారం రోజులే క్రితమే మక్కలు, వడ్లు తీసుకెళ్లారు. లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తూకం వేయలేదని స్థానికులు చెబుతున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన యాకూబీ

కాజీపేట: మతిస్థిమితం లేకుండా రహదారులపై తిరుగుతున్న ఓ వ్యక్తిని సహృదయ అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ.యాకూబీ మంగళవారం సాయంత్రం చేరదీసి ఆశ్రమానికి తరలించింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట మాసిన బట్టలు, పెరిగిన జుట్టుతో వర్షంలో తడిసి అటు ఇటూ తిరుగుతున్న వ్యక్తిని చూసి ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం అందించారు. స్పందించిన యాకూబీ కలెక్టర్ కార్యాలయం ముందుకు చేరుకుని పేరు, ఊరు చెప్పలేక పోతున్న వ్యక్తిని సొంత వాహనంలో ఆశ్రమానికి తరలించి శుభ్రంగా తయారు చేసి వైద్య పరీక్షలు జరిపించి మందులను అందించారు. ఈ సందర్భంగా యాకూబీని పలువురు అభినందించారు.

జూన్ 2 నాటికి పూడికతీత పూర్తి కావాలి

వరంగల్ అర్బన్ : వర్షాలు కురుస్తున్నందున నాలాల్లో పూడీకతీత పనులు జూన్ 2 నాటికి పూర్తి కావాలని మేయర్ గుండు సుధారాణి ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం భద్రకాళి నాలాలో కొనసాగుతున్న పూడిక తీత పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ ముంపు నివారణ చర్యలలో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో 33 ప్రధాన నాలాల పూడికతీత కొనసాగుతున్నదని, ఇప్పటికే 70 శాతం పూర్తయిందన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆప్‌లో పూడికతీత నమోదు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. కార్పొరేటర్లు విజయలక్ష్మీ, మరుపల్లి రవి, ఏఈ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే అరూరి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయిలో సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్చించారు. జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను పండుగలా జరపాలని సూచించారు. అందుకు సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. సంక్షేమ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా పేర్కొన్నారు. నగర మేయర్‌గుండు సుధారాణి మాట్లాడుతూ తొమ్మిదేళ్లల్లో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు కళ్ల ముందు కనిపిస్తున్నాయని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ అన్ని వర్గాలను భాగస్వాములు చేస్తూ అవతరణ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీలు మధుమతి, జెడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

‘హజ్’ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని సందర్శించిన మేయర్



వరంగల్ : హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ : తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ, హజ్ సొసైటీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో వరంగల్ ఎల్‌బీనగర్ అబ్బూస్ ఫంక్షన్ హాల్లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని మంగళవారం మేయర్ గుండు సుధారాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సౌదీ అరేబియా ప్రభుత్వం ఆదేశించిన విధంగా వ్యాక్సినేషన్ వేసుకునేందుకు నమోదు చేసుకున్న హజ్ యాత్రికుల కోసం ఈ శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో వరంగల్, భూపాలపల్లి జిల్లాలకు చెందిన సుమారు 100 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాక్సినేషన్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డీఐఓ డాక్టర్ మధుసూదన్, రాష్ట్ర హజ్ కమిటీ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ ఉల్ హక్, వరంగల్ జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు ఫూజి సర్వర్ మోహియుద్దీన్, దర్గా పీఠాధిపతులు ఖుస్రూ పాషా, నవిద్ బాబా పాల్గొన్నారు.

కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు చర్యలు

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్ వివేకానంద కాలనీలో కలుషితమైన నీరు వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టడం జరిగిందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆమె నీటి సరఫరాను పరిశీలించి, అట్టి నీటిని తాగి పరిశుభ్రమైన నీరు వస్తుందని నిర్ధారించారు. కాలనీవాసుల ఫిర్యాదుతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కాలనీలో నివసిస్తున్న వారి ఇళ్లలోకి వెళ్లి మహిళలను నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాశీబుగ్గలోని ఏకలవ్య ఉద్యానవనంలోని ఓపెన్ జిమ్ వద్ద సాధన చేస్తున్న మహిళలతో ముచ్చటించారు. పార్క్‌లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే మిషన్ భగీరథ ఈఎస్ఎల్ఆర్‌ను మేయర్ పరిశీలించారు. ఆమె వెంట డీఈఈ రవికిరణ్, ఏఈ సౌజన్య, బీఆర్ఎస్ నేతలు ఓని భాస్కర్ తదితరులు ఉన్నారు.

‘బండి’ని కలిసిన జిల్లా మున్నూరు కాపు కమిటీ



హన్మకొండ చౌరస్తా : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం హనుమకొండ జిల్లా మున్నూరుకాపు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా జిల్లా కమిటీని ఎన్నుకున్న సందర్భంగా సంజయ్‌ని కలిసి కమిటీ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కుల సభ్యులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కలిసిన వారిలో హనుమకొండ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం పటేల్, ప్రధాన కార్యదర్శి గుర్రాల చంద్రమౌళి, సాయిని రవీందర్, కోశాధికారి కూరపాటి సత్యప్రకాష్, జాయింట్ సెక్రెటరీ కొండ నాగరాజు, కొలగాని నిరంజన్, గుండ్ల శ్రీనివాస్, రవికుమార్, సురేందర్, రఘుపతి, ముఖ్య సలహాదారులు రజనీకాంత్, సాంబయ్య ఉన్నారు.

టీవీ టవర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ

హన్మకొండ: హనుమకొండలోని టీవీ టవర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నల్ల సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండపెల్లి కిషన్‌రెడ్డి, కోశాధికారిగా పూజారి మనోజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, భిక్షపతి, అంజయ్య గౌడ్, సహ కార్యదర్శులుగా బుచ్చిరెడ్డి, నర్సింగరావు, సురేందర్, కార్యవర్గ సభ్యులు, సలహాదారులను ఎన్నుకున్నారు.

సీఐటీయూ ద్వారానే ఉద్యోగ, కార్మికుల హక్కులు



నయీంనగర్ : నినాదాలు చేస్తున్న రమేష్



వరంగల్ చౌరస్తా: జెండా ఎగురవేస్తున్న రామస్వామి

నయీంనగర్: సీఐటీయూ ద్వారానే ఉద్యోగ, కార్మికుల హక్కులు కొనసాగుతున్నాయని సీఐటీయూ ఐ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. మంగళవారం కేయూ క్రాస్‌రోడ్‌లో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ దోపిడీ రహిత సమాజం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం నిరంతరం రాజీ లేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు రవి, మొగిలి, రాజేందర్, రవి, కుమార్, మధు, శ్రీనివాస్, లక్ష్మీ, బతుకమ్మ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

కరీమాబాద్: కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన అనంతరం రామస్వామి మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు శ్రమను దోచుకునే దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరంతరం పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మీర్‌షాజియా, ఉపేందర్, అప్పాజీ, వాణి, గ్రామిక, దివ్య, జుబేద, రవీందర్, ఇస్మాయిల్, యాకుబ్‌పాషా, రవీందర్, పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా : కార్మికుల హక్కుల కోసం, శ్రమను దోచుకునే దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని యూనియన్ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ బట్టల బజారులో ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గున్నాల ప్రభాకర్, మీర్ షాజియా, ఉపేందర్, అప్పాజీ వాణి, దివ్య, జుబేదా, రవీందర్, ఇస్మాయిల్, యాకూబ్ పాషా, రవీందర్ మహబూబ్, దస్తగిరి, ప్రసాద్, మాశుబి, పాల్గొన్నారు.

దారిని ఆక్రమిస్తే నడిచేది ఎలా..?

- లబోదిబోమంటున్న కుటుంబాలు
- భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కని పిస్తే పాగా వేస్తున్నారు. వెంచర్‌కు వెళ్లే దారులపై కన్నేస్తున్నారు. బాధితులు మొర పెట్టుకున్నా వినే పరిస్థితి కనిపించడం లేదు. ధనం ఉన్న వాడిదే బలం అన్నట్లుగా పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కినా న్యాయం జరిగే పరిస్థితి లేక సామాన్య ప్రజలు లబోదిబోమంటున్నారు. తాజాగా ఖిలావరంగల్ శివారు వరంగల్ దూపకుంట రోడ్డులోని ఓ మహిళ తన పెళ్లి కోసం తన తల్లి, ఇతర బంధువుల సమక్షంలో పట్టా భూమిని వరంగల్ గిర్మాజీపేటకు చెందిన వ్యక్తికి 2014 జులై 17న 490 గజాల స్థలాన్ని విక్రయించి రిజిస్ట్రేషన్ చేసింది. ఈ స్థలాన్ని 100 గజాలు ప్లాటుగా మరో 390 గజాల రోడ్డుగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఓ కబ్జాదారుడి ప్రోత్సాహంతో సదరు మహిళ 8 ఏళ్ల క్రితం విక్రయించిన రోడ్డు స్థలంపై తిరిగి కన్నేసింది. ఆ మహిళా నకిలీ పత్రాలను సృష్టించి 2022 నవంబర్ 24న మండల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి ఆ స్థలాన్ని ఇరువురు కలిసి మరొకరికి విక్రయించేందుకు యత్నిస్తూ దొరికిపోయారు. విషయం తెలిసి యజమాని సదరు మహిళ, గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆమె అన్నపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సైతం విచారణ చేపడుతుండగా మంగళవారం ఈ రోడ్డు స్థలంపై ఓ భూకబ్జా ముఠా తిష్టవేసి యజమానిని బెదిరించి బేరాసారాలు ఆడుతున్నారు. తిరిగి స్థలాన్ని కొనుగోలు చేయి లేదా స్థలాన్ని మేం వీడేది లేదని ముఠా సభ్యులు తెగపడుతున్నారని బాధితుడు వాపోతున్నాడు. ఇకనైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి భూ కబ్జాలకు పాల్పడుతున్న ముఠాపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్‌నకు కూచిపూడి విద్యార్థులు



లక్ష్మీప్రియ



స్నిగ్ధ సిరిమల్లి



సోనాక్షి రెడ్డి



అనిశ్రిత రెడ్డి

హన్మకొండ కల్చరల్ : భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ అందించే సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెనింగ్ (సీసీఆర్‌టీ) స్కాలర్‌షిప్‌కు కూచిపూడి విభాగంలో నగరానికి చెందిన చిన్నారులు ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం 10 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేస్తారు. హన్మకొండకు చెందిన శ్రీసద్గురు శివానంద నృత్యమాల నిర్వాహకులు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థినులు 2022 సంవత్సరానికి పెండ్యాల లక్ష్మీప్రియ, స్నిగ్ధ సిరిమల్లి గుడె, 2023 సంవత్సరానికి సోనాక్షి రెడ్డి నరహర స్కాలర్‌షిప్ సాధించారు. వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కుందూరు అనిశ్రిత రెడ్డి కూచిపూడి విభాగంలో 2022, 2023 సంవత్సరాలకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభకనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం విశేషం.

కార్మికుల కోసమే ధర్మయుద్ధ పోరాట సభ

- చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట : అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో కార్మిక ధర్మ యుద్ధ పోరాట సభను ఏర్పాటు చేసినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. పట్టణంలో మంగళవారం కూరగాయల మార్కెట్ ఆవరణలో చిరు వ్యాపారులతో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న కార్మిక అభివృద్ధి ఫలాలు ప్రతి కార్మికుడికి దక్కాలనే సంకల్పంతోనే అవగాహన కోసం బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ధర్మయుద్ధ పోరాట మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు హాజరవుతున్న నేపథ్యంలో కార్మికులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కార్మిక నల్ల చట్టాలను తీసుకువచ్చిన కేంద్రం

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక నల్ల చట్టాలను తీసుకొచ్చి హక్కులు కాలరాస్తుందని చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కార్మిక చైతన్య మాసోత్సవంలో భాగంగా మంగళవారం హనుమకొండలోని పలు షాపింగ్ మాల్‌లను ఆయన సందర్శించారు. అనంతరం కార్మికులతో ముచ్చటించారు. నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కోడ్‌లతో కనీస వేతనం పెంచాలంటే యాజమాన్యం పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన కార్మిక కోడ్‌లకు నిరసనగా ఈ నెల 31న కార్మిక యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

తనను మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ మీలో ఒకడిగా ఉంటున్నానని అన్నారు. మంగళవారం హనుమకొండ టీవీ టవర్ కాలనీలో బీఆర్ఎస్ 57వ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో దాస్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానన్నారు. పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమ్మేళనంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడ శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, మేకల బాబురావు, బాబుమియా, కాలనీల కమిటీ అధ్యక్షులు వెంకటరాజిరెడ్డి, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల విచారణలో ఇద్దరు వ్యక్తులు

వరంగల్: వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని మణికంఠకాలనీలోని ప్లాట్ల అక్రమణకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను ఏనుమాముల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. మణికంఠకాలనీ రోడ్డు నంబర్ 4లోని తమ ప్లాట్లను అక్కడ స్థానికంగా నివాసం ఉంటున్న కేదాసి మోహన్, ఎల్ఐసీ వెంకటేష్‌లు కబ్జా చేశాడంటూ బాధితులు ఎలకంటి నాగరాజు, చింతల శ్రీను, గట్ల జగన్మోహన్, రాముల మంజుల గతంలో వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా అప్పటి ఏసీపీ గిరికుమార్ విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఏసీపీ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించారు. ఈకేసుపై ఎలాంటి చర్యలు లేక పోవడంతో తాజాగా బాధితులు ప్రస్తుత సీపీ రంగనాథ్‌ను కలిసి మరోమారు ఫిర్యాదు చేశారు. ఈకేసును ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధి నుంచి ఏనుమాముల పోలీసులకు అప్పగించడంతో సీఐ మహేందర్, ఎస్సై శ్రీకాంత్‌లు మంగళవారం ఈప్లాట్ల కబ్జా వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కబ్జా చేసినట్లు ఆరోపిస్తున్న వ్యక్తిని ఏనుమాముల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈవిషయంపై ఏనుమాముల పోలీసులను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు సీపీ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో ప్లాట్లకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

రేపు శివాజీ సంతాపసభ

నయీంనగర్: జూన్ 1న నూతి ఛత్రపతి శివాజీ సంతాప సభ హన్మకొండ హంటర్‌రోడ్ సత్యం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు బంధుమిత్రులు తెలిపారు. మంగళవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శివాజీ మే 22న ఎంజీఎం ఆస్పత్రిలో పరమపదించారని తెలిపారు. శివాజీ గుంటూరు జిల్లా బోడిపాలెం రైతు కుటుంబంలో పుట్టి వరంగల్ నిట్‌లో చదువుతూ విప్లవ రాజకీయాల వైపు వెళ్లి 1989లో అరెస్ట్ అయి మూడేళ్ల జైలు జీవితం గడిపాడని తెలిపారు. కమ్యూనిస్టుగా, మురళీసార్‌గా ప్రజలతో మమేకమై నిస్వార్థంగా జీవించాడన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిషలు కృషి చేశాడన్నారు. బ్రాహ్మణ ఆధిపత్య భావజాలాన్ని విడనాడి పార్థీవ దేహాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో మే 23న కాకతీయ వైద్య కళాశాలకు అప్పగించారని తెలిపారు. సంతాప సభకు బంధువులు, స్నేహితులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో భార్య నూతి కౌసల్య, కూతురు అరుణ, నూతి ఆమని, చైతన్య వెంకటకుమార్, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఖిలా వరంగల్ : కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైన 84 ఏళ్ల వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నర్మెట్ట స్వామి కథనం ప్రకారం..వరంగల్ 17వ డివిజన్ నర్సంపేట రోడ్డులోని జాన్ పీరీలకు చెందిన నర్మెట స్వామి ఇంట్లో తండ్రి కట్టయ్య (84) ఉంటున్నాడు. ఈనెల 26న రాత్రి తన గదిలోని కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుమారుడు వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతుడి చెందాడు. మంగళవారం మృతుడి కుమారుడు స్వామి గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అశ్రిత్‌ను అభినందించిన ‘నాయిని’



హన్మకొండ అర్బన్ : సివిల్స్ సర్వీసెస్ పరీక్షల్లో ఆల్ ఇండియా 40వ ర్యాంకు సాధించిన శాకమూరి శ్రీ సాయి అశ్రిత్‌ను మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పూలబొకే అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. సాయి అశ్రిత్ అఖిల భారత సర్వీస్ ప్రయాణంలో మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించిం ప్రజాసేవలో తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయిని అమరేందర్‌రెడ్డి, కటంగూరి వంశీకృష్ణ, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్, వరంగల్ వెస్ట్ అసెంబ్లీ మాజీ ఉపాధ్యక్షుడు తోట పవన్, తదితరులు ఉన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి

మడికొండ: జూన్ 4న భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్న ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం మడికొండ చౌరస్తాలో సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో విఫలం చెందయన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం

హసన్‌పర్తి: ఇటీవల విద్యుదాఘాతానికి గురై వీధిన పడిన సీతంపేటకు చెందిన నేదునూరి సాంబయ్య కుటుంబానికి తెలంగాణ ఉద్యమకారుడు బండారి చేరాలు అండగా నిలిచారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి బట్టలు అందించారు. పరామర్శించిన వారిలో కొడారి కుమార్, చిర్ర దామోదర్, శ్రీనివాస్, రాజయ్య, రమేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు పదవీ బాధ్యతలు చేపట్టనున్న స్వర్ణ

వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు పీసీసీ నాయకులు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ మంగళవారం తెలిపారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పీసీసీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నందున కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు

వరంగల్ : నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో అంతర్గత రహదారులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలోని అంతర్గత రహదారులు బురదమయం కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తమ బాధలను అర్థం చేసుకుని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, మున్సిపల్ అధికారులు స్పందించి అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని అభివృద్ధి కమిటీ నాయకులు క్యాతం రవీందర్, ఎల్లయ్య కోరుతున్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

హసన్‌పర్తి : రానున్న సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. 66జ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత దేశాన్ని విశ్వగురుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

చిన్న వర్షానికే ఇళ్లలోకి బురద



నాలాను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ : చిన్నవర్షానికే బురద ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ కుసుమ సతీష్ అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఉప్పొంగి పొర్లిపోతున్న ప్రధాన నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిగా మొద్దు నిద్రలో ఉందన్నారు. చిన్నపాటి వర్షానికే ప్రధాన నాలాలు ఉప్పొంగి ప్రవహించడంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 21వ డివిజన్‌లో అనేక మురికి కాలువలు ఉప్పొంగి పొర్లి దాంట్లో ఉన్న చెత్తాచెదారం పేరుకపోవడంతో వ్యర్థాలు అడ్డుపడి చిన్నవర్షానికే బురద ఇళ్లల్లోకి వస్తుందని ఆరోపించారు. ప్రధాన నాలాల్లో పూడికతీతలు తీస్తున్నామని ప్రకటనలే తప్పా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదన్నారు. నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రేక్షక పాత్ర వహిస్తున్న పాలకవర్గం మేల్కొని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పరిశీలించిన వారిలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, సీనియర్ నాయకులు పరమేశ్వర్, మార్టిన్ లూథర్, మురళీకృష్ణ, అపురూప రజినిష్ నేత, చింతం రాజు, ధర్మపురి రామారావు ఉన్నారు.